# బీఆర్ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించండి



అయిజలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు

◆ ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

అయిజ, నవంబర్ 16 : అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు కోరారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సూచనల మేరకు పర్యటించి బీఆర్ఎస్ అభ్యర్థి పక్షాన ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ పదేండ్లలో అహర్నిషలు కష్టపడి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలిచి పోతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి సీఎంగా చేయాలంటే అలంపూర్ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

**వడ్డేపల్లిలో..**

వడ్డేపల్లి, నవంబర్ 16 : వడ్డేపల్లి మున్సిపాలిటీలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కరుణ ఎన్నికల ప్రచారం నిర్వహించగా మహిళా ఓటర్లు ఆమె వెంట నడిచారు. మహిళలకు కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, గృహలక్ష్మి, ఇంటివద్దకే తాగునీటి నీళ్ళు, అంగన్‌వాడీలో పౌష్టికాహారం, విడో, వృద్ధాప్యా పింఛన్లు ఇలా అనేక పథకాలు ఆకట్టుకున్నాయని అందుకే మహిళల్లో మంచి స్పందన వస్తుందని ఆమె అన్నారు. కారు గుర్తు ఓటు వేసి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి బలపర్చిన అభ్యర్థి విజయుడిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కౌన్సిలర్ ధనలక్ష్మి, శ్రీనివాస చౌదరి, తోటరవి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు



శాంతినగర్‌లో మురుకులు వేస్తున్న చైర్ పర్సన్ కరుణ

**బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన టీఎస్ ఎమ్మార్పీస్**

వడ్డేపల్లి, నవంబర్ 16 : శాంతినగర్‌లో గురువారం టీఎస్ ఎమ్మార్పీఎస్ జా తీయ వర్కింగ్ ప్రెసి డెంట్ బల్గర హుస్సేన్ ఆధ్వర్యంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దళితల ఆర్థిక అభివృద్ధికి, ఉన్నతికి పథకాలను ప్రవేశపెట్టి ఆదుకుంటున్నాడని, బీజేపీ, కాంగ్రెస్ హామీలను ఇచ్చి మోసం చేసిందని ఆయన అన్నారు. చల్లా నాయకత్వంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి గెలుపునకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాశం, ఇసాక్, యోబు, రాజు, సందీప్, దొర బాబు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో అనేక మార్పులు

వడ్డేపల్లి, నవంబర్ 16 : వ్యవసాయ రంగంలో అనేక మార్పులు వచ్చాయని వాటిని అమలు పర్చాలని మదనపల్లి నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. గురువారం మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని ఐకేపీ కార్యాలయంలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు కృషివిజ్ఞాన కేంద్రం మదనపల్లి సహకారంతో శాస్త్రవేత్తలు డాక్టర్ దాదాసాహేబ్, డాక్టర్ భవానిలు రైతులకు పలు వాటిపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, ఎంపీడీవో గోవిందరావు, శిక్షణ నోడల్ అధికారి శ్రీనివాసులు, కోఆర్డినేటర్ మహేశ్, ఎంపీవోలు, విజయలలిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## జములమ్మ ఆలయానికి స్థలం వితరణ



సిద్ధమవుతున్న జములమ్మ ఆలయం

వడ్డేపల్లి, నవంబర్ 16 : మండలంలోని జూలేకల్ గ్రామంలో వెలసిన జమ్ములమ్మ నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. గ్రామానికి చెందిన కరణం సీతారామారావు, నరసింహరావులు 15 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. అమ్మవారికి ఇత్తడి తోరణం, అమ్మవారి పాదుకలను విరాళంగా అందజేశారు. ఈ నెల 19న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, ప్రమీళమ్మ, పద్మావతి, రూపశ్రీ, తన్మయి పాల్గొన్నారు.

## రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉండవెల్లి, నవంబర్ 16 : రైలుకింద పడి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటు చేసుకున్నది. రైల్వేహెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని జోగుళాంబ హాల్ట్ వద్ద మధ్యాహ్నం ఒంటి గంటకు నిజాముద్దీన్ నుంచి తిరుపతికి వెళ్తున్న రైలుకింద పడి గుర్తు తెలియని వృద్ధుడు (80) ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడు అలం పుర్ నియోజక వర్గ వాసి ఉండి ఉండొచ్చన్నారు. వృద్ధుడి ఆచూకి తెలిసిన వారు గద్వాల రైల్వే పోలీసులను 8309067184, 8712658608ను సంప్రదించాలన్నారు.

## పాతకక్షలతో వ్యక్తి దారుణహత్య..

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 16 : పాతకక్షలతో వ్యక్తి దారుణహత్యకు గురైన ఘటన మండలం వల్లూరు గ్రామంలో చోటుచేసుకున్నది. సీఐ రాజు, కోదండాపూర్ ఎస్సై కృష్ణదేవ కథనం మేరకు.. వల్లూరు గ్రామానికి చెందిన హుసేన్ (68) బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లివస్తానని వెళ్లాడు. ఎంతకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు బయటకు వెళ్లిచూడగా తెలిసిన వ్యక్తులు హుసేన్‌ను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఉరి చివరన గోదం దగ్గర పడేశారని కుటుంబ సభ్యులకు తెలిపారు. వెంటనే గోదం వద్దకు వెళ్లిచూడగా హుసేన్ రక్తపుమడుగుల్లో అప్పటికే మృతి చెందాడన్నారు. గతంలో గ్రామానికి చెందిన ఉప్పరి శేషన్న, హుసేకు గొడవలు ఉండేవని, పాతకక్ష్యల నేపథ్యంలో హుసేన్‌ను చంపిఉంటాడనన్నారు. కుంటుంబ సభ్యులు ఉప్పరి శేషన్న పై అనుమానం వ్యక్తపరుస్తూ కోదండాపూర్ పీఎస్‌లో కోడలు మహబూబబీ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఓటరు ప్రలోభాలకు లోనూ కాకూడదు

ఇటిక్యాల, నవంబర్ 16 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు కలిగిన ప్రతిఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో రాఘవ సూచించారు. మండలంలోని పెద్దదిన్నె గ్రామంలో ఆయన గురువారం ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం ఆయన గ్రామంలోని పోలింగ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లను ఆయన పంచాయతీ కార్యదర్శి శివన్నతో మాట్లాడారు.



పెద్దదిన్నెలో ఓటుహక్కుపై సూచనలిస్తున్న ఎంపీడీవో

## పాడిపరిశ్రమపై రైతులు శ్రద్ధ వహించాలి

◆ పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు

గట్టు, నవంబర్ 16 : రైతులు వ్యవసాయంతోపాటు అనుబంధంగా పాడి పరిశ్రమపై దృష్టి పెడితే లాభాల దిశగా పయనించవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వేంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి రైతులతో మాట్లాడారు. ప్రతి రైతు పాడిపరిశ్రమపై దృష్టి వహించాలన్నారు. ఆవులు, గేదెల పెంపకం ద్వారా పాలఉత్పత్తితో ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కృత్రిమ గర్భధారణకు సంబంధించి తాజాగా ఆడదూడలు మాత్రమే పుట్టే విధంగా వ్యాక్సిన్ వచ్చిందన్నారు. దీని ధర కూడా కేవలం రూ.350 మాత్రమేనని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాడి సంపదను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శంకరయ్య, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు వైన్స్‌షాపులు నిర్వహించాలి

గద్వాల అర్బన్, నవంబర్ 16 : వైన్స్ షాపు నిర్వాహకులు తప్పకుండా ఆబ్కారీశాఖ అధికారులు నిబంధనల మేరకు దుకాణాలునిర్వహించాలని నోడల్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో పలు వైన్స్ షాపులలో గద్వాల ఆబ్కారీశాఖ సర్కిల్ ఈఐ గోపాల్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించి స్టాక్ వివరాలు ఆరా తీశారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపస్తున్న తరుణంలో అధికారుల సూచనలు పాటించకుండా వ్యవహరిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆబ్కారీశాఖ సిబ్బంది ఉన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలిస్తే చర్యలు

గద్వాల అర్బన్, నవంబర్ 16 : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా నగదును తరలిస్తే చర్యలు తప్పవని ఎస్పీ రితిరాజ్ అన్నారు. ఎన్నికల కోడ్ సందర్భంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో పట్టుబడిన నగదును గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఆమె తెలిపారు. బుధవారం గద్వాల పట్టణ పోలీసులు చేపట్టిన తనిఖీలో రూ.2లక్షలు పట్టుబడ్డాయని తెలిపారు. అలాగే గురువారం నిర్వహించిన తనిఖీలలో రూ.3.10 లక్షలు పట్టుబడినట్లు తెలిపారు. ఎలాంటి రసీదులు లేనందున నగదు మొత్తాన్ని గ్రీవెన్స్ కమిటికీ అప్పగించినట్లు తెలిపారు. అలాగే సరి హద్దులలో కూడా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## అనారోగ్యంతో సర్పంచ్ మృతి

ఇటిక్యాల, నవంబర్ 16 :మండలంలోని శివనంపల్లె సర్పంచ్ గోవిందమ్మ (68) అనా రోగ్యంతో గురువారం మృతి చెందింది. గత కొన్ని రోజులుగా ఆమె శ్వాసకోశ సంబంధ వ్యాధితో బాధపడుతూ తీవ్ర అనా రోగ్యానికి గురయ్యారు. కర్నూల్‌లో చికిత్స పొందుతున్న ఆమె గురువారం మృతి చెందిందని కుటుంబసభ్యులు తెలిపారు.

# ఆర్డీఎస్ ఆనకట్టకు స్థిరంగా వరద



సింధనూర్ హెడ్‌రెగ్యులేటర్ దగ్గర ఆర్డీఎస్ ప్రధానకాల్వలో పారుతున్న నీరు

అయిజ, నవంబర్ 16 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నిలకడగా కొనసాగుతోంది. గురువారం ఆర్డీఎస్ ఆనకట్టకు 4,329 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 3,800 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 529 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.6 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వస్తున్న నీటితో ఆర్డీఎస్ ఆయకట్టుతోపాటు చెరువులను నింపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు స్వల్ప వరద..**

కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి వరద స్వల్పంగా చేరుతున్నది. ఇన్‌ఫ్లో 1,545 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 8,450 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎం సీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 24.061 టీఎం సీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ట నీటి మట్టానికి, ప్రస్తుతం 1601.89 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.

# అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌వద్ద తనిఖీలు



44వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఉండవెల్లి, నవంబర్ 16 : అంతర్రాష్ట్ర పుల్లూరు చెక్‌పోస్ట్ వద్ద తెలంగాణ రాష్ట్రంలోకి వచ్చే వాహనాలను అధికారులు తనిఖీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, బెంగుళూరు నుంచి వచ్చే వాహనదారులకు తెలంగాణ ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించి నగదు, మద్యం, ఓటర్లు ప్రభావితం చేసే వస్తువుల తరలింపుపై నిఘా ఉంచినట్లు చెక్‌పోస్ట్ అధికారులు పేర్కొన్నారు. తనిఖీల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.